సాక్షి కృష్ణాజిల్లా

శుక్రవారం । 21 । ఫిబ్రవరి । 2025



మర్యాద పూర్వక కలయిక

పెనమలూరు: రాష్ట్ర ఫిషరీస్ కమిషనర్ రామ్‌శంకర్‌నాయక్‌ను గురువారం ఆయన కార్యాలయంలో కృష్ణా కలెక్టర్ బాలాజీ మర్యాదపూర్వకంగా కలిశారు.



రైతుబజార్‌లోనే టమాటా విక్రయం

టమోటాను రైతుబజార్‌లోనే విక్రయించాలని గురువారం మచిలీపట్నంలో మార్కెటింగ్ శాఖ ఏడీ నిత్యానందం రైతులకు చెప్పారు. ఆయన రైతుబజార్‌ను పరిశీలించారు. -8లో▸



గిట్టుబాటు ధర కల్పించాలి

జగ్గయ్యపేట అర్బన్: మిర్చి పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని వైఎస్సార్ సీపీ నేతలు డిమాండ్ చేశారు. గురువారం జగ్గయ్యపేటలో పలువురు రైతులు మిర్చిని ప్రదర్శించారు.

న్యూస్‌రీల్

ఆరోగ్య కార్యక్రమాల్లో ప్రగతి సాధించాలి

లబ్బీపేట(విజయవాడతూర్పు): జిల్లాలో నిర్వహిస్తున్న ఆరోగ్య కార్యక్రమాల లక్ష్యాల్లో ప్రగతి సాధించాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ మాచర్ల సుహాసిని సూచించారు. నగరంలోని తన కార్యాలయంలో గురువారం వివిధ ప్రోగ్రాంల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎన్‌సీడీ-సీడీ సర్వేలో ప్రగతి, 4డీ స్క్రీనింగ్, మాతా శిశు సంరక్షణ సేవలు, ప్రధాన మాతృత్వ వందన యోజన ప్రగతి, వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం నిర్వహణ తీరుపై సమీక్షించారు. మీజిల్స్ రూబెల్లా వ్యాక్సినేషన్ డ్రైవ్, ఎఫ్‌ఆర్‌ఎస్ ముఖ ఆధారిత హాజరు, ఆయుష్మాన్ భారత్ గుర్తింపు సంఖ్య జారీ వంటి అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. కార్యక్రమంలో డీఎల్‌ఓ, టీఓ డాక్టర్ జె.ఉషారాణి, డీఐఓ డాక్టర్ శరత్‌బాబు, డెప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఇందుమతి, ఏపీడిమియాలజిస్ట్ డాక్టర్ స్నేహసమీర, స్టాటిస్టికల్ ఆఫీసర్ లక్ష్మోజీ, డిప్యూటీ డెమో ప్రభాకరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ పారా అథ్లెటిక్స్‌లో 15 పతకాలు



విజయవాడస్పోర్ట్స్: చెన్నైలో జరిగిన జాతీయ పారా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో రాష్ట్ర క్రీడాకారులు సత్తా చాటారు. ఈ నెల 17 నుంచి 20వ తేదీ వరకు జరిగిన పోటీల్లో ఆరు బంగారు, మూడు రజతం, ఆరు కాంస్య పతకాలను సాధించారు. పతకాలు సాధించిన వారిలో రొంగలి రవి(అనకాపల్లి), కిల్లాక లలిత(విజయనగరం), అంబటి స్వరాజ్ (శ్రీకాకుళం), వి.రావణి(విశాఖపట్నం), ఎస్.నవీన్(కాకినాడ), వి.భవాని(గుంటూరు), కలీషాబాషా(ప్రకాశం), ఐ.శ్యామ్(గుంటూరు), బి.గౌతం(కర్నూలు) ఉన్నారు. పతకాలు సాధించిన క్రీడాకారులకు శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు, ఎండీ గిరీషా, ఏపీ పారా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షకార్యదర్శులు జి.కోటేశ్వరరావు, వి.రామస్వామి అభినందనలు తెలిపారు.

పిల్లల ఆరోగ్య పరిస్థితిపై కలెక్టర్ ఆరా

తిరువూరు: ఎ.కొండూరు మండలం పెదతండా అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం పౌష్టికాహారం తీసుకున్న పిల్లల్లో తొమ్మిది మంది అస్వస్థతకు గురై మైలవరం ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. వీరి ఆరోగ్య పరిస్థితిపై ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశా వైద్యాధికారులను ఫోన్‌లో ఆరా తీశారు. పిల్లలు కడుపు నొప్పి, వాంతులు, విరేచనాలతో బాధపడుతున్నారని, వీరికి అవసరమైన ఇంజక్షన్లు, మందులు ఇచ్చామని వైద్యులు వెల్లడించారు. వారి ఆరోగ్య పరిస్థితి పూర్తిగా కుదుటపడేవరకు చికిత్స అందించాలని కలెక్టరు సూచించారు. పెద తండా అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారుల్లో గుగులోతు మాధుర్య, జరబల జశ్వంత్ దత్తా, గుగులోతు సాయిదినేష్, భూక్యా సతీష్ కుమార్, భూక్యా మోక్షిత్, జరపల యోహాన్, జరపల శాన్వి, అజ్మీరా తేజస్, అజ్మీరా రిషిత్, అజ్మీర చరిత మైలవరం ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు వైద్యులు వెల్లడించారు.


కోలాహలంగా వీరమ్మతల్లి తిరునాళ్ల



ఉయ్యూరు: వీరమ్మతల్లి తిరునాళ్లలో భక్తజనం సందడి చేశారు. గురువారం వేకువజాము నుంచే భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. పలువురు నేతలు, ప్రముఖులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నసంతర్పణ జరిగింది.

రిజిస్ట్రేషన్ల ఆదాయం కుదేలు

- జోరు తగ్గుముఖం
- జిల్లాలో 10 నుంచి 40 శాతం అదనంగా భూముల ధరలు పెంపు
- సగటున 20శాతం చార్జీలు
- ప్రజలు వెనుకంజ
- జిల్లాలో 13 సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు



గుడ్లవల్లేరు: జిల్లాలో ఆస్తుల రిజిస్ట్రేషన్ల ఆదాయం తగ్గింది. రిజిస్ట్రేషన్ల జోరు తగ్గుముఖం పట్టడానికి భూముల ధరల పెంపే కారణమని తెలుస్తోంది. జనవరి నెలలో కృష్ణా జిల్లాలో 9,439 రిజిస్ట్రేషన్లు జరగడంతో ప్రభుత్వ ఖజానాకు రూ.48.62లక్షల ఆదాయం వచ్చింది. ఫిబ్రవరిలో భూముల ధరల పెంపుతో పాటు రిజిస్ట్రేషన్ల చార్జీలు పెరిగాయి. దీంతో ఈ నెలలో 6,924 రిజిస్ట్రేషన్లు మాత్రమే జరగడంతో కేవలం రూ.20.86 లక్షల ఆదాయం మాత్రమే ప్రభుత్వానికి వచ్చింది. అందుకు అడ్డగోలుగా కూటమి ప్రభుత్వం పెంచేసిన భూముల ధరలే ప్రధాన కారణమన్న విమర్శలు జిల్లా ప్రజల నుంచి వెల్లువెత్తుతున్నాయి. జిల్లాలో 10 నుంచి 40 శాతం అదనంగా భూముల ధరలను పాలకులు పెంచేశారు. సగటున 20శాతం రిజిస్ట్రేషన్ చార్జీలు పెరిగిపోయాయి. దీంతో రిజిస్ట్రేషన్లకు ప్రజలు వెనుకంజ వేస్తున్నారు. జిల్లాలో 13 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి.

సంపద సృష్టి పేరుతో ఇష్టారాజ్యంగా ధరల పెంపు

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక పాలకులు సంపద సృష్టి పేరిట ఇష్టారాజ్యంగా ధరలు పెంచి ప్రజలపై మోయలేని భారం మోపుతున్నారు. ఇప్పటికే విద్యుత్ చార్జీలు, నిత్యావసరాల ధరలు భారీ పెరుగుదలతో ప్రజలు విలవిలలాడిపోతున్నారు. తాజాగా భూముల రిజిస్ట్రేషన్ల ఫీజును పెంచేసి కొత్త బాదుడుకు శ్రీకారం చుట్టారు. దీంతో భూముల అమ్మకాలు, కొనుగోళ్ల సంఖ్య తగ్గింది. పల్లెలు, పట్టణాలు అనే తేడా లేకుండా 10 నుంచి 40 శాతం వరకు భూముల ధరలను పెంచేసి.. రిజిస్ట్రేషన్ల ధరలు కూడా సగటున 20శాతానికి ఈ నెల ఒకటో తేదీ నుంచి పెంచేశారు. ఈ విధానం అమల్లోకి వచ్చిన నేపథ్యంలో భూములు, నివాసాలు, అపార్ట్‌మెంట్లు, వాణిజ్య భవనాల విలువలు అమాంతంగా పెరిగిపోయాయి. ఈ ప్రభుత్వ విధానంతో సామాన్య, మధ్య తరగతి వర్గాల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

భారీగా చార్జీలు

అర్బన్‌లో 35శాతం, రూరల్‌లో 40 శాతం వరకు భూముల విలువలు పెంచారు. అధిక శాతం పట్టణ ప్రాంతాల్లో 20శాతానికి పైగా ధరలు అధికమైతే.. అధిక శాతం మండలాల్లో 30 శాతానికి పైగా పెరిగాయి. తాజా పెంపుతో కొన్ని పట్టణ ప్రాంతాల్లో మార్కెట్ విలువ కంటే.. ప్రభుత్వ ధర ఎక్కువగా ఉన్నట్లు రియల్టర్లు చెబుతున్నారు.

సామాన్యులకు సమస్యే

బిడ్డల చదువులు, వివాహాలతో పాటు ఇతర అవసరాల నిమిత్తం ఉన్న కాస్త ఆస్తిని అమ్మకానికి పెట్టినా.. కొనేవారు లేక సామాన్యులు ఇబ్బందులకు గురవుతున్నారు. గతంలో నెలకు ఒక్క ప్లాట్ అయినా విక్రయించేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితి కనపడటం లేదు.

అప్పులు చేసి వెంచర్లు వేసిన వారి పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. రిజిస్ట్రేషన్ల చార్జీల పెంపుతో పరిస్థితి మరింత దిగజారిందన్న ఆందోళనలో బాధితులు ఉన్నారు.

బాబు హామీ.. నీటిమూట

రిజిస్ట్రేషన్ చార్జీలు పెంచబోమంటూ గారడీ మాటలు చెప్పిన చంద్రబాబు ఎన్నికల హామీ నీటి మూటలా మారింది. అధికారంలోకి వచ్చిన ఎనిమిది నెలలకే జనాలపై ఆర్థిక భారం వేశారు. జిల్లాలో పెరిగిన 20 శాతం రిజిస్ట్రేషన్ చార్జీలు ఒక్కో ప్రాంతానికి ఒక్కో రేటుగా అమల్లోకి వచ్చింది. ప్రజలపై పెంచిన భారాన్ని తన సంపద సృష్టిలా బాబు భావించడంపై సర్వత్రా వ్యతిరేకతలు వస్తున్నాయి.

కొత్త ధరలతో రిజిస్ట్రేషన్లు

రిజిస్ట్రేషన్లపై పెంచిన చార్జీలు అమల్లోకి వచ్చాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో భూములు, ఇతర ఆస్తుల విలువలను బట్టి ధరల్లో వ్యత్యాసం ఉంటుంది. ధరలు పెరుగుతుండటంతో గత కొద్ది రోజులుగా రిజిస్ట్రేషన్ల సంఖ్యలో వ్యత్యాసం కనిపిస్తోంది. ప్రస్తుతం పెంచిన ధరల ప్రకారం జిల్లాలో సగటున 20శాతం వరకు రిజిస్ట్రేషన్ చార్జీలు పెరిగాయి.

– ఎం.ఎస్.జి.కె.మూర్తి, జిల్లా రిజిస్ట్రార్

సమన్వయంతో రోడ్డు ప్రమాదాల నివారణ



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ, సీపీ రాజశేఖరబాబు

డీఆర్‌సీసీ సమావేశంలో కలెక్టర్ లక్ష్మీశ, సీపీ రాజశేఖరబాబు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రాజధాని ప్రాంతానికి ముఖద్వారమైన విజయవాడను 'ట్రాఫిక్' క్రమశిక్షణతో కూడిన నగరంగా తీర్చిదిద్దడానికి అధికారులు సమన్వయంతో కృషి చేయాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ, పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు అన్నారు. కలెక్టరేట్‌లోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో గురువారం రహదారి భద్రత కమిటీ (డీఆర్ఎస్‌సీ) సమావేశం జరిగింది. జిల్లాలో రోడ్డు ప్రమాదాల స్థితిగతులు, బ్లాక్ స్పాట్‌ల వద్ద తీసుకున్న చర్యలు, రహదారి భద్రత ఉల్లంఘనలపై చర్యలు, హిట్ అండ్ రన్ మోటార్ యాక్సిడెంట్ స్కీం–2022, ఐ-రాడ్ అమలు, రహదారి భద్రత అవగాహన కార్యక్రమాలపై చర్చించారు.

ట్రాఫిక్ వ్యవస్థను సమర్థంగా నిర్వహించే అస్త్రం యాప్‌పై కమిటీలో చర్చించారు. 2024లో జిల్లాలో మొత్తం 1,343 రహదారి ప్రమాదాలు జరిగాయని, వీటిలో 431 మరణాలు నమోదయ్యాయని అధికారులు వివరించారు. ఈ మరణాల్లో జాతీయ రహదారులపై ప్రమాదాలతో 212, రాష్ట్ర హైవేలపై ప్రమాదాలతో 79, ఇతర రహదారులపై ప్రమాదాలతో 140 సంభవించాయని వివరించారు. కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ రహదారి ప్రమాదాలకు అడ్డుకట్ట వేయాల్సిన అవసరముందన్నారు.

బ్లాక్‌స్పాట్‌లు..

ఎన్‌హెచ్-16పై 17 బ్లాక్‌స్పాట్‌లు, ఎన్‌హెచ్-30పై 17, ఎన్‌హెచ్-65పై 49, ఎస్‌హెచ్-192పై 1, ఎస్‌హెచ్-236పై 3, ఎస్‌హెచ్-32పై 3, ఇతర రహదారులపై 49 మొత్తం 139 హాట్‌స్పాట్లను గుర్తించామన్నారు. ఆయా ప్రాంతాల్లో ఒక్క ప్రమాదం కూడా జరగకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలన్నారు.

సమగ్రంగా ట్రాఫిక్ డేటా విశ్లేషణ: సీపీ

జిల్లాతోపాటు విజయవాడలో ట్రాఫిక్ వ్యవస్థను సమర్థంగా నిర్వహించడానికి రియల్ టైమ్ డేటాను విశ్లేషిస్తున్నామని.. ఆ ఫలితాల ఆధారంగా క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకుంటున్నట్లు పోలీస్ కమిషనర్ రాజశేఖరబాబు తెలిపారు. బెంజిసర్కిల్ వద్ద అనలిటిక్స్‌ను విశ్లేషించగా.. 84 శాతం మంది హెల్మెట్‌ను ధరించినట్లు వెల్లడైందని తెలిపారు. ట్రాఫిక్ పరిస్థితుల అధ్యయనానికి డ్రోన్లను కూడా ఉపయోగిస్తున్నట్లు వివరించారు. సమావేశంలో డీసీపీలు గౌతమిశాలి, మహేశ్వరరాజు, కేజీవీ సరిత, ఎం.కృష్ణమూర్తి నాయుడు, డీటీసీ ఎ.మోహన్, ఆర్ అండ్ బీ ఎస్‌ఈ టి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇల్లూ.. సోలార్ రూఫ్‌టాప్‌తో వెలగాలి

- పీఎం సూర్యఘర్‌ను వినియోగించుకోండి
- డీఆర్వో చంద్రశేఖరరావు



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్వో చంద్రశేఖరరావు, అధికారులు

చిలకలపూడి(మచిలీపట్నం): ప్రధాని సూర్యఘర్‌ను వినియోగించుకుని ప్రతి ఇల్లూ.. సోలార్ రూఫ్‌టాప్‌తో వెలగాలని జిల్లా రెవెన్యూ అధికారి కె.చంద్రశేఖరరావు అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశపు హాల్లో గురువారం వివిధ శాఖల ఉద్యోగులకు సూర్యఘర్ పథకంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. డీఆర్వో మాట్లాడుతూ ప్రజలు అతి తక్కువ ఖర్చుతో లబ్ధిదారుల ఇంటిపై సోలార్ ప్యానల్‌ను ఏర్పాటు చేసుకోవడంతో తయారైన విద్యుత్‌ను ఉచితంగా గృహ అవసరాలకు వినియోగించుకోవచ్చన్నారు. దీంతో కరెంట్ బిల్లులు చెల్లించనక్కర్లేదన్నారు. 360 యూనిట్ల ఉత్పత్తి సామర్థ్యం కలిగిన 3 కిలోవాట్ల సోలార్ రూఫ్ టాప్‌కు రూ. 78,400, 240 యూనిట్ల ఉత్పత్తి సామర్థ్యం కలిగిన 2 కిలోవాట్ల సోలార్ రూఫ్ టాప్‌కు రూ. 60 వేలు, 120 యూనిట్ల ఉత్పత్తి సామర్థ్యం కలిగిన కిలోవాట్‌కు రూ. 30 వేలు ప్రభుత్వం రాయితీ ఇస్తోందన్నారు. దాదాపుగా 20 ఏళ్లు సౌర విద్యుత్‌ను పొందవచ్చన్నారు. గృహ అవసరాలకు వినియోగించిన అనంతరం మిగిలిన సౌర విద్యుత్‌ను గ్రిడ్‌కు ఇచ్చి ఆదాయం పొందవచ్చన్నారు. ప్రతి నెలా విద్యుత్ బిల్లులు చెల్లించే మొత్తంతో బ్యాంకు రుణం చెల్లిస్తే రుణం తీరిపోతుందన్నారు. ఈ పథకంలో రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి కాలయాపన లేకుండా వెంటనే రుణాలు మంజూరు చేయాలని ఇప్పటికే బ్యాంకర్లకు సూచించామన్నారు. సమావేశంలో మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ పి.సాయిబాబు, కలెక్టరేట్ ఏవో సీహెచ్ వీరాంజనేయప్రసాద్, ఉద్యోగులు పాల్గొన్నారు.

విస్తృత స్థాయిలో ఎంఎస్ఎంఈ సర్వే

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ



వివరాలు అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ లక్ష్మీశ

నందిగామ టౌన్(నందిగామ రూరల్): ఆరోగ్యకర పారిశ్రామిక ఆర్థిక వ్యవస్థను పెంపొందించే లక్ష్యంతో జిల్లాలో ఎంఎస్ఎంఈ సర్వేను విస్తృత స్థాయిలో చేపడుతున్నట్లు కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ పేర్కొన్నారు. నందిగామ పట్టణంలో జరుగుతున్న ఎంఎస్ఎంఈ సర్వే (ఉద్యమ్) యాప్‌లో సమాచారాన్ని పొందుపరిచే ప్రక్రియను గురువారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పారిశ్రామిక యూనిట్‌కు రుణాలు అవసరమా, నైపుణ్యాభివృద్ధితో పాటు మార్కెటింగ్ అవసరాలు, యూనిట్లకు అవసరమైన చేయూత నందించడానికి సర్వే నిర్వహిస్తున్నారన్నారు. ఎంఎస్ఎంఈ యూనిట్లలో సాంకేతిక వినియోగం, నిర్వహణ నైపుణ్యాల్లో లోపాలను గుర్తించి, సరిదిద్దడానికి కూడా సర్వే ఫలితాలు దోహదపడతాయని చెప్పారు. ఎవరికైనా సందేహాలుంటే గ్రామ, వార్డు సచివాలయాలను సంప్రదించి నివృత్తి చేసుకోవాలని సూచించారు. ఎంఎస్ఎంఈ యూనిట్లు 100 శాతం వెరిఫికేషన్ ప్రక్రియ పూర్తికి క్షేత్రస్థాయిలో అధికారులు, సిబ్బంది కృషి చేస్తున్నారని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలను స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా పరిష్కరించినట్లు కలెక్టర్ పేర్కొన్నారు. పలువురు అధికారులు పాల్గొన్నారు.

నాడు వద్దని.. నేడు అదేపని..

- కూటమి యూ టర్న్
- భూముల రీ సర్వేకు మళ్లీ శ్రీకారం
- గతంలో రీ సర్వే చేపట్టిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం
- నాడు వద్దని కూటమి దుష్ప్రచారం
- నేడు అదే తరహా రీ సర్వే చేపట్టిన సర్కార్
- మండలానికో గ్రామంలో పైలట్ ప్రాజెక్టుగా నిర్వహణ
- 23 గ్రామాల్లో 31,723 ఎకరాలే లక్ష్యం..



గన్నవరంలో రీ సర్వే నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది.

సాక్షి, మచిలీపట్నం: నాడు భూముల రీ సర్వే వద్దని డిమాండ్ చేసి.. నేడు అదే పని చేయాలంటూ కూటమి ప్రభుత్వం యూ టర్న్ తీసుకుంది. దశాబ్దాలుగా ఉన్న భూ వివాదాలు, సమస్యలకు శాశ్వత పరిష్కారానికి రీ సర్వే అవసరం. దీన్ని గుర్తించి గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం జిల్లాలోని మూడు మండలాల్లో చేపట్టింది. గ్రామ సచివాలయాల్లోని సర్వేయర్లు, వీఆర్వోలు, రెవెన్యూ అధికారులతో పనులు మొదలు పెట్టింది. దీన్ని నాడు కూటమి నేతలు వ్యతిరేకించారు. రీ సర్వేపై అసత్య ప్రచారాలు, ఆరోపణలు చేసిన టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు.. రైతులు, ప్రజల్లో ఆందోళన కలిగించారు. అధికారంలోకి వచ్చాక ఇప్పుడు కూటమి ప్రభుత్వం అదేపని చేస్తోంది. రెవెన్యూ సదస్సులు నిర్వహించి, వచ్చిన విజ్ఞప్తులపై రీ సర్వే మార్గాన్ని ఎంచుకుంది. జిల్లాలోని ప్రతి మండలం నుంచి ఒక గ్రామంలో రీ సర్వేకు శ్రీకారం చుట్టింది.

నాడు మూడు మండలాల్లో పూర్తి

భూ తగాదాలు, సమస్యలను పరిష్కరించి, భూములను పూర్తి హక్కులతో యజమానులకు అప్పజెప్పడానికి గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రీసర్వే చేయించింది. భూముల చట్టబద్ధతకు ప్రత్యేక చట్టాన్ని తీసుకొచ్చింది. ఇందులో భాగంగా జిల్లాలోని గుడివాడ, గుడ్లవల్లేరు, పామర్రు మండలాల్లో రీ సర్వేను విజయవంతంగా పూర్తి చేసింది. నాడు కూటమి దుష్ప్రచారం చేసినా.. లోపాలకు తావు లేకుండా పూర్తి చేసింది. ఎన్నికల కారణంగా ఆగింది.

వ్యతిరేకించి.. నేడు అనుసరిస్తున్నారు

గత ప్రభుత్వం చేపట్టిన విధానాలను వ్యతిరేకించిన సీఎం చంద్రబాబు.. నేడు వాటినే అనుసరిస్తున్నారు. ముఖ్యంగా నాడు ఇసుక విధానాన్ని వ్యతిరేకించి.. తర్వాత అదే తరహా పాలసీని అమలు చేస్తున్నారు. భూముల రీ సర్వేపై నాడు టీడీపీ విష ప్రచారం చేసింది. భూములు లాగేసుకుంటారంటూ తప్పుడు ప్రచారానికి ఒడిగట్టి ప్రజలు, రైతుల్లో ఆందోళన కలిగించారు. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం నేడు అదే రీ సర్వే మార్గాన్ని ఎంచుకుంది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నిర్వహించిన మూడు మండలాలు మినహా.. మిగిలిన మండలాల్లో ఒక్కో గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది.

గ్రామ సర్వేయర్లతో..

గ్రామ సచివాలయ వ్యవస్థను గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం తీసుకొచ్చింది. అందులో ముఖ్యమైన ప్రతి శాఖలకు ఉద్యోగిని నియమించింది. వారిలో గ్రామ సర్వేయర్లతో నాడు అనేక పనులు చేయించారు. ఇప్పుడు ఆ సర్వేయర్లతోనే ప్రభుత్వం రీసర్వే పనులు చేయిస్తోంది.

గ్రామ సరిహద్దులు ఏర్పాటు, సర్వే నంబర్లలో హక్కుదారులెవరున్నారు? వారి భూములకు పట్టాదారు పాసు పుస్తకాలున్నాయా? వంటి అంశాలు పరిశీలిస్తున్నారు. లేనివారికి మ్యూటేషన్ ప్రక్రియ మొదలు పెట్టారు. యజమాని మరణిస్తే వారసులు తమ పేరిట భూ హక్కులు మార్చుకోవడానికి వీఆర్వోకు దరఖాస్తు చేసుకోవాలి.

జిల్లాలో ఇలా..

జిల్లాలోని 23 మండలాల్లోని 23 గ్రామాలను ఎంపిక చేసి, పైలెట్ ప్రాజెక్ట్‌గా రీసర్వే చేస్తున్నారు. మార్చి 15 నాటికి పూర్తి చేయాలనే లక్ష్యంతో రీ సర్వే డెప్యూటీ తహసీల్దార్లు, రెవెన్యూ డీటీలు, విలేజ్ సర్వేయర్లు, వీఆర్వోలు 394 మంది సిబ్బందితో, 58 రోవర్స్‌తో ఈ ప్రక్రియ చేపడుతున్నారు. మొత్తం 31,723.89 ఎకరాల భూమిలో 19,428 ఎకరాల్లో రీసర్వే పూర్తైంది. 6,535.20 ఎకరాలు ప్రభుత్వ భూమి ఉండగా 4,710 ఎకరాలు పూర్తైంది. ప్రస్తుతానికి వివరాలు రికార్డుల్లో నమోదు చేస్తున్నారు. ఆ తర్వాత ఆన్‌లైన్‌లో ఎంట్రీ చేయనున్నారు.

మార్చి 15లోపు పూర్తికి చర్యలు

రీ సర్వే ప్రక్రియను మార్చి 15వ తేదీలోపు పూర్తి చేయడానికి చర్యలు చేపట్టాం. దీనిపై ఆర్ఎస్‌డీటీలు, రెవెన్యూ సిబ్బంది, గ్రామ సర్వేయర్లు, వీఆర్వోలకు ఇప్పటికే అవగాహన కల్పించాం. రోవర్, డ్రోన్ల సాయంతో పారదర్శకంగా నిర్వహిస్తున్నాం. రీ సర్వేతో అనేక ప్రయోజనాలు ఉన్నాయి. రైతులు, ప్రజలు వినియోగించుకోవాలి.

– ఎం. జోషీలా, జిల్లా సర్వే, భూమి రికార్డుల అధికారి

కిసాన్ క్రెడిట్ కార్డులు తక్షణమే జారీ చేయాలి

ఏపీ కౌలురైతుల సంఘం, ఏపీ రైతు సంఘం




వినతిపత్రం అందజేస్తున్న కౌలు రైతు సంఘాల ప్రతినిధులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు బ్యాంకులు కౌలు రైతులకు 'కిసాన్ క్రెడిట్ కార్డులు' తక్షణమే జారీ చేయాలని ఏపీ కౌలు రైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య, ఏపీ రైతు సంఘం ఉపాధ్యక్షుడు మల్నీడు యల్లమందారావు, ఏపీ కౌలు రైతుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పెయ్యల వెంకటేశ్వరరావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రబీలో కౌలు రైతులకు ష్యూరిటీ లేని పంట రుణాలు వడ్డీ లేకుండా తక్షణమే మంజూరు చేయాలని, సాగు భూమి దామాషాను బట్టి స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం రుణాలు ఇవ్వాలన్నారు. ఈ మేరకు రాష్ట్రస్థాయి బ్యాంకర్స్ కమిటీ కన్వీనర్ సీవీఎన్ భాస్కరరావును కలిసి వినతిపత్రం అందజేశారు. 'ఏపీ పంట సాగుదారు హక్కుల చట్టం 2019' ప్రకారం గుర్తింపు కార్డులు పొందిన వారికి హామీలు లేకుండానే బ్యాంకు నుంచి పంట రుణాలు పొందవచ్చనని నిబంధనలు ఉన్నా వాటిని పాటించడం లేదని కౌలురైతుల ఆవేదనను లీడ్ బ్యాంక్ మేనేజర్ దృష్టికి తీసుకెళ్లారు. రుణాలు ఇవ్వాలని అడిగితే భూ యజమాని ష్యూరిటీ సంతకం పెట్టాలని, భూ యజమాని పంట రుణాలు తీసుకోకుండా ఉండాలంటూ ఇలా అనేక ఆంక్షలు పెడుతూ అప్పు ఇవ్వకుండా తిరస్కరిస్తున్నారని తెలిపారు. దేవదాయ ధర్మాదాయ, వక్ఫ్ భూములు సాగు చేస్తున్న కౌలురైతులకు రుణాలు ఇవ్వాలని కోరారు. పంట రుణాల సమీక్ష సమావేశంలో కౌలు రైతులను, సంఘాల ప్రతినిధులను భాగస్వామ్యం చేయాలని విన్నవించారు. లీడ్ బ్యాంకు కన్వీనర్ సి. భాస్కరరావు సానుకూలంగా స్పందించారన్నారు. అనంతరం ఎన్టీఆర్ జిల్లా లీడ్ బ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్ రమేష్ ను కలిసి జిల్లాలో రబీలో పంటరుణాలు అందించాలని విజ్ఞప్తి చేశారు.

బడ్జెట్‌లో చేనేత రంగానికి రూ.2వేల కోట్లు కేటాయించాలి

చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి నాగేశ్వరరావు



మంగళగిరి టౌన్ : రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్‌లో చేనేత రంగానికి రూ. 2వేల కోట్లు నిధులు కేటాయించాలని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి నాగేశ్వరరావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మంగళగిరి నగర పరిధిలోని ఏపీ చేనేత కార్మిక సంఘం కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. నాగేశ్వరరావు మాట్లాడుతూ చేనేతలకు జనాభా ప్రాతిపదికన నిధులు కేటాయించాలని కోరారు. చేనేత సహకార సంఘాలకు బకాయి ఉన్న రూ. 172 కోట్లను వెంటనే విడుదలచేయాలని డిమాండ్ చేశారు. ఈ సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని, నేతన్న నేస్తం పథకాన్ని రూ.24 వేల నుంచి రూ.36 వేల రూపాయలకు పెంచాలని కోరారు. బడ్జెట్‌లో తగినన్ని నిధులు కేటాయించకుంటే ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షులు వెంకట కృష్ణారావు, ఉపాధ్యక్షులు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

1,37,523 బస్తాల మిర్చి విక్రయం

కొరిటిపాడు(గుంటూరు): మార్కెట్ యార్డుకు గురువారం 1,29,446 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 1,37,523 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల సగటు ధర రూ.9,000 నుంచి రూ.14,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల సగటు ధర రూ.10,000 నుంచి రూ.14,000 వరకు ధర లభించింది. తాలు రకం మిర్చికి రూ.4,500 నుంచి రూ.7,500 వరకు ధర పలికింది.



అధికారుల సమావేషాలు!

క్లుప్తంగా

మహిళా ఉద్యోగులకు వివిధ అంశాల్లో పోటీలు


క్రీడా పోటీల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న అతిథులు

విజయవాడస్పోర్ట్స్: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మహిళా ఉద్యోగులకు క్రీడా, వక్తృత్వ, వ్యాసరచన పోటీలను నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఏపీ ఎన్‌జీజీవో(నాన్ గెజిటెడ్ అండ్ గెజిటెడ్ ఆఫీసర్స్) అసోసియేషన్ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు నిర్మలకుమారి తెలిపారు. ఈ పోటీలకు సంబంధించిన కర పత్రాలను విజయవాడలోని రవాణా శాఖ కమిషనరేట్ కార్యాలయంలో గురువారం ఆమె ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ మార్చి ఎనిమిదో తేదీన అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమాన్ని పురస్కరించుకుని ఏపీ ఎన్‌జీజీవో అసోసియేషన్ రాష్ట్ర మహిళా విభాగం ఆధ్వర్యంలో మహిళా ఉద్యోగులకు మార్చి 4, 5 తేదీల్లో ఇందిరా గాంధీ మునిసిపల్ కార్పొరేషన్ స్టేడియం, గాంధీనగర్‌లోని ఏపీ ఎన్‌జీజీవో హోంలో క్రీడా, వ్యాసరచన, వక్తృత్వ పోటీలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రన్నింగ్, వాకింగ్, టగ్ ఆఫ్ వార్, టెన్నికాయిట్, లెమన్ అండ్ స్పూన్, మ్యూజికల్ చైర్, క్యారమ్స్, చెస్, పాటలు, నృత్యం అంశాల్లో పోటీలుంటాయన్నారు. విజేతలకు ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో రవాణా శాఖ ఉద్యోగుల రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.ఉమామహేశ్వరి, ఏపీ ఎన్‌జీజీవో అసోసియేషన్ మహిళా కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

తప్పుడు రిజిస్ట్రేషన్‌తో మోసం.. వ్యక్తిపై కేసు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): భూమిని తప్పుడు రిజిస్ట్రేషన్ చేసి ఒక వ్యక్తిని మోసం చేసిన వారిపై భవానీపురం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు.. విశాఖపట్నంకు చెందిన పూసర్ల విశ్వేశ్వర రావు గొల్లపూడి గ్రామంలోని సర్వే నంబర్ 234/1 నందు ఎకరం భూమిని గ్రామానికి చెందిన నూతలపాటి ఉషారాణి వద్ద కొనుగోలు చేశాడు. 2016లో ఇబ్రహీంపట్నం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. ఏడాది తర్వాత ఆర్‌ఓఆర్ సర్టిఫికెట్ కోసం తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేశాడు. సదరు భూమిని తాను కొనుగోలు చేయడానికి నెల రోజుల ముందే భాస్కర్‌రెడ్డి అనే వ్యక్తికి విక్రయించినట్లు అధికారులు తెలిపారు. దీనిపై అతను వెంటనే ఉషారాణిని సంప్రదించగా.. భాస్కర్‌రెడ్డికి తాము బాకీ ఉన్నామని, అతని బాకీ చెల్లించి రిజిస్ట్రేషన్ రద్దు చేసుకుంటామని తెలిపారు. ఉషారాణి, ఆమె భర్త మల్లికార్జునరావు రిజిస్ట్రేషన్ రద్దు చేసుకునేందుకు 10 రోజులు గడువు కోరారు. గడువు ముగిసినా భాస్కర రెడ్డికి చేసిన రిజిస్ట్రేషన్ రద్దు చేసుకోకపోవడంతో బాధితుడు విశ్వేశ్వరరావు భవానీపురం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఉషారాణి, ఆమె భర్త కుట్ర పూరితంగా తనను మోసం చేశారని ఫిర్యాదులో పేర్కొన్నాడు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

ఇంటర్ విద్యాధికారుల రూటే సెపరేటు

- జిల్లా కేంద్రం వైపు చూడని అధికారులు
- సమావేశాలన్నీ ఉయ్యూరులోనే..
- జిల్లా కేంద్రంలోనే పెట్టాలన్న ఉన్నతాధికారుల ఆదేశాలు బేఖాతర్
- ప్రైవేటు కళాశాలలకు లబ్ధి చేకూర్చేందుకేనని ఆరోపణలు
- కలెక్టర్ ప్రమేయాన్ని తగ్గించడం పైనా విమర్శలు

పెడన: ఇంటర్‌మీడియెట్ విద్యాధికారుల తీరు విమర్శలకు తావిస్తోంది. సాధారణంగా అధికారిక సమావేశాలు జిల్లా కేంద్రంలో నిర్వహించడం పరిపాటి. అయితే అందుకు భిన్నంగా ఇంటర్ అధికారులు ఉయ్యూరు కేంద్రంగా సమావేశాలు నిర్వహిస్తూ విధానపరమైన నిర్ణయాలు చేస్తున్నారు. ఇటీవల ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలకు ముందు సంబంధిత అధికారులతో సమావేశాన్ని ఉయ్యూరులోనే నిర్వహించారు. ఇప్పుడు తాజాగా ఇంటర్ పరీక్షల నిర్వహణపై కూడా ఇక్కడే సమావేశం కానున్నట్లు తెలుస్తోంది.

ఒకటో తేదీ నుంచి పరీక్షలు..

మార్చి ఒకటో తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించడానికి జిల్లాలోని ఆర్‌ఐవోలు, డీఐఈవోలు జిల్లా కేంద్రాల్లో ఫ్లైయింగ్ స్క్వాడ్, చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటు అధికారులు, అసిస్టెంట్ సూపరింటెండెంట్లు, కస్టోడియన్లు ఇలా 150 మందికి పైగా సిబ్బందిని నియమించారు. వీరందరికీ ఈ నెల 23న జిల్లా కేంద్రంలో కాకుండా ఉయ్యూరులో సమావేశం పెట్టి దిశానిర్దేశం చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నారు.

ప్రైవేటుకు మేలు చేసేందుకేనా?

వాస్తవంగా జిల్లా కేంద్రంలో ఇటువంటి సమావేశాలు నిర్వహించి జిల్లా కలెక్టర్‌ను ఆహ్వానించాలి. కానీ ఇంటర్మీడియెట్ అధికారులు ఆ దిశగా అడుగులు ముందుకు వేయకపోవడం, జిల్లా కలెక్టర్ ప్రమేయాన్ని తగ్గించడం విమర్శలకు తావిస్తోంది. అదీ కాకుండా ప్రైవేటు కళాశాలలను ఎన్డీయే కూటమి అందలం ఎక్కించడమే లక్ష్యంగా పావులు కదుపుతుందనే విషయానికి ఈ సమావేశం బలం చేకూర్చుతోందనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. గతంలో పనిచేసిన ఇంటర్ ఉన్నతాధికారులు జిల్లా కేంద్రంలోనే సమావేశాలు నిర్వహించి పరీక్షల సిబ్బందికి మార్గదర్శకాలను జారీ చేసేవారు. కానీ ఇప్పుడున్న అధికారి మాత్రం ఉన్నతాధికారుల ఆదేశాలను సైతం పట్టించుకోకుండా తన ఇష్టానుసారంగా జిల్లా కేంద్రానికి ఎక్కడో దూరంగా ఎన్టీఆర్ జిల్లాకు దగ్గరగా ఉన్న ఉయ్యూరులో సమావేశాలను నిర్వహిస్తుండటం పలు అనుమానాలకు తావిస్తోంది. మరో పక్క జిల్లా కేంద్రానికి ప్రాధాన్యం ఇవ్వాల్సిన జిల్లా అధికారులు జిల్లా కేంద్రాన్ని వదిలిపెట్టి ఉయ్యూరులో సమావేశాలు, శిక్షణ తరగతులు నిర్వహిస్తుండటంపై విమర్శలు వస్తున్నాయి. కావాలని జిల్లా కేంద్రాన్ని నిర్వీర్యం చేస్తున్నారనే పలువురు బహిరంగంగానే విమర్శిస్తున్నారు.



రాత మారని బందరు..

ఉమ్మడి కృష్ణాజిల్లాగా ఉన్న సమయంలో మచిలీపట్నం కేంద్రంగా ఉన్నా.. విజయవాడలోనే అత్యధికంగా జిల్లా అధికారులుండే వారు. దీంతో విజయవాడలోనే సమావేశాలు నిర్వహిస్తూ వచ్చారు. ప్రస్తుతం జిల్లాలు విడిపోయినా, అధికారులు జిల్లా కేంద్రాల్లో ఉంటున్నా కూడా జిల్లా కేంద్రంగా మచిలీపట్నాన్ని గుర్తించకపోవడం విడ్డూరంగా ఉంది.

> **జిల్లా కేంద్రంలోనే నిర్వహించాలి..**
>
> ఇంటర్ పరీక్షలు నిర్వహించే చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంట్ అధికారులకు, ఫ్లయింగ్ స్క్వాడ్‌లకు, కస్టోడియన్లకు సమావేశం జిల్లా కేంద్రంలోనే పెట్టాలని స్పష్టం చేశాం. అయితే ఆ రోజు అంటే 23న గ్రూపు–2 పరీక్ష ఉందన్నారు. 22న పెట్టుకోవాలని చెప్పాం. బందరులోని హిందూ కళాశాల, నోబుల్ కళాశాలలున్నాయి. వాటిల్లో సమావేశం పెట్టుకోవాలని ఆదేశించాం.
>
> – వీవీ సుబ్బారావు, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్, ఇంటర్మీడియెట్

టమాటాను రైతుబజారులోనే విక్రయించండి

మార్కెటింగ్ ఏడీ నిత్యానందం



మచిలీపట్నంటౌన్: టమాటాను పండించే రైతులు వాటిని బహిరంగ మార్కెట్‌లో కాకుండా రైతు బజార్‌లోనే విక్రయించుకోవాలని మార్కెటింగ్ శాఖ ఏడీ నిత్యానందం సూచించారు. రైతు బజారును ఆయన గురువారం ఆకస్మికంగా పరిశీలించారు. టమాటా దిగుబడి ఎక్కువగా రావటంతో ధర కిలో రూ.13 ఉన్నందున బహిరంగ మార్కెట్‌లో తక్కువ ధర వస్తుందని, అందువల్ల రైతు బజారులో స్వయంగా విక్రయిస్తే లాభం వస్తుందన్నారు. బయట మార్కెట్‌లో దళారులకు విక్రయించి నష్ట పోవద్దన్నారు. రైతు బజార్‌లో దుకాణాల్లో కాటాలు సక్రమంగా ఉన్నదీ లేనిదీ ఆయన పరిశీలించారు. రైతు బజార్లో నడవడానికి కూడా లేకుండా దుకాణాలను అస్తవ్యస్తంగా నిర్వహిస్తున్న రైతుల తీరుపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. పర్యటనలో ఆయన వెంట రైతు బజారు ఎస్టేట్ అధికారి ఎల్. బలిచక్రవర్తి, పకీర్, ఆనంద్ ఉన్నారు.

అవయవదానమిచ్చి.. ఆదర్శంగా నిలిచి..

మరో నలుగురికి పునర్జన్మనిచ్చిన మహిళ


సరస్వతి (ఫైల్)

భవానీపురం(విజయవాడపశ్చిమ): అవయవ దానంతో కొందరి జీవితాల్లో వెలుగులు నింపిన ముత్యాల సరస్వతి (55) జీవితం ధన్యమైంది. విజయవాడ గొల్లపూడి బైపాస్ రోడ్‌లోని బాలాజీ టవర్స్‌లో నివసిస్తున్న ముత్యాల సరస్వతి, ఆమె కుమారుడు ముత్యాల రామ్‌కుమార్ ఈ నెల 14న బైక్‌పై వెళుతుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో సరస్వతి తలకు దెబ్బతగిలి తీవ్రంగా గాయపడింది. దాంతో రామ్‌కుమార్ తల్లిని ఓ ప్రైవేటు హాస్పిటల్‌లో చేర్పించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం మంగళగిరి ఎయిమ్స్ హాస్పిటల్‌కు తరలించారు. ఈ క్రమంలో ఆమె చికిత్సకు స్పందించకపోవడంతో బ్రెయిన్ డెడ్ అయినట్లు 19వ తేదీన వైద్యులు ప్రకటించారు. ముత్యాల సరస్వతి అవయవాలను దానం చేసేందుకు ఆమె కుటుంబసభ్యులు ముందుకు వచ్చారు.

చిరస్మరణీయురాలు..

విషయం తెలిసి తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సిన్హా హాస్పిటల్‌కు వచ్చి మృతురాలికి పుష్పాంజలి ఘటించారు.

చనిపోతూ మరి కొందరి జీవితాల్లో వెలుగులు నింపిన సరస్వతి చిరస్మరణీయురాలని కొనియాడారు. ఆమె దేహం నుంచి రెండు కిడ్నీలు, లివర్, రెండు కళ్లు సేకరించామని తెలిపారు. కళ్లను ఎల్‌వీ ప్రసాద్ నేత్ర వైద్యశాలకు అప్పగించామని చెప్పారు. మృతురాలి కుటుంబసభ్యులకు జీవన్‌దాన్ సర్టిఫికెట్, రూ.10వేలు అందించామని, అయితే ఆ మొత్తాన్ని పేదల వైద్య సేవలకు ఖర్చు చేయాలని ఆమె కుమారుడు రామ్‌కుమార్ తిరిగి హాస్పిటల్‌కే ఇచ్చేశారని పేర్కొన్నారు. అనంతరం సరస్వతి మృతదేహాన్ని గొల్లపూడిలోని ఆమె నివాసానికి తరలించే ఏర్పాట్లు చేశారు.


నివాళులు అర్పిస్తున్న వెలంపల్లి, పక్కన విలపిస్తున్న రామ్‌కుమార్

వెలంపల్లి నివాళులు..

సమాచారం అందుకున్న వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యులు, పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వెలంపల్లి శ్రీనివాసరావు గురువారం సరస్వతి మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. ముత్యాల రామ్‌కుమార్, కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. కార్పొరేటర్లు యరడ్ల ఆంజనేయరెడ్డి, బాపతి కోటిరెడ్డి, ఎండీ ఇర్ఫాన్, నాయకులు పదిలం రాజశేఖర్, వెలది అనిల్ శర్మ, పలువురు పార్టీ శ్రేణులు ఉన్నారు. కాగా గురువారం విద్యాధరపురంలోని హిందూ స్మశానవాటికలో సరస్వతి అంత్యక్రియలు నిర్వహించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కృత్తివెన్ను: మండల పరిధిలోని అడ్డపర్ర వద్ద గురువారం రాత్రి 216 జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు అడ్డపర్రకు చెందిన గార్లపాటి కోటేశ్వరరావు(65) రోడ్డు పక్కన నడుచుకుంటూ వెళ్తుండగా కృత్తివెన్ను నుంచి మచిలీపట్నం వైపుగా వెళ్తున్న ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. దీంతో కోటేశ్వరరావు కిందపడిపోయి అపస్మారస్థితిలోకి వెళ్లాడు. స్థానికుల సమాచారంతో 108 వాహన సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని కోటేశ్వరరావును పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి, పోస్టుమార్టం నిమిత్తం మచిలీపట్నం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

మర్చిపోయిన బ్యాగ్ మహిళకు అప్పగింత


మహిళకు బ్యాగ్ ఇస్తున్న పోలీసులు


బ్యాగ్‌లోని బంగారు ఆభరణాలు, నగదు

భవానీపురం(విజయవాడపశ్చిమ): బంగారు ఆభరణాలు, నగదు ఉన్న హ్యాండ్ బ్యాగ్‌ను ఆటోలో మరిచిపోయిన ఘటనపై బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదుపై స్పందించిన పోలీసులు దర్యాప్తు చేసి తిరిగి వాటిని అప్పగించారు. కొత్తపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పిల్లా పార్వతి, దుర్గారావు దంపతులు చిట్టినగర్ సొరంగం దగ్గర నివసిస్తున్నారు. ఈ క్రమంలో పార్వతి తన కుటుంబసభ్యులతో కలిసి ఐదు రోజుల క్రితం విజయనగరం వెళ్లారు. తిరిగి గురువారం ఉదయం 10 గంటల సమయంలో విజయవాడ రైల్వే స్టేషన్ వెస్ట్ బుకింగ్ వద్ద దిగి బయటకు వచ్చారు. అక్కడ ఆటోను కిరాయికి మాట్లాడుకొని చిట్టినగర్ సొరంగం దగ్గర ఉన్న ఇంటికి చేరుకున్నారు. ఆటో దిగే సమయంలో పార్వతి తన హ్యాండ్ బ్యాగ్‌ను ఆటోలోనే మరిచిపోయారు. అందులో ఐదు తులాల బంగారు వస్తువులు, పది వేల రూపాయల నగదు, ఒక సెల్ ఫోన్ ఉన్నాయి. వెంటనే ఆమె కొత్తపేట పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. తక్షణమే సీఐ చిన కొండలరావు తమ సిబ్బందిని విచారణకు పంపారు. బాధితురాలు ఆటో ఎక్కిన సమయం, దిగిన సమయం తెలుసుకున్నారు. అలాగే ఆయా ప్రదేశాల్లో ఉన్న సీసీ కెమెరాలు పరిశీలించారు. ఆటో డ్రైవర్ నున్న దగ్గర కండ్రిక వెళ్లిపోగా సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి అతని ఆటోను గుర్తించారు. ఫిర్యాదులో పేర్కొన్న బంగారపు వస్తువులు, నగదు, ఫోన్ స్వాధీనం చేసుకుని ఆమెకు తిరిగి ఇచ్చారు.

సమర్థంగా ఎమ్మెల్సీ ఎన్నికలు

- కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ
- ఉయ్యూరులో పోలింగ్ సామగ్రి పరిశీలన

ఉయ్యూరు: కృష్ణా–గుంటూరు జిల్లాల పట్టభద్రుల ప్రాదేశిక నియోజకవర్గ సభ్యుల పోలింగ్ నిర్వహణ సమర్థంగా జరగాలని కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ఆదేశించారు. ఉయ్యూరు పట్టణంలో పోలింగ్ నిర్వహించే జిల్లా పరిషత్ పాఠశాల, రెవెన్యూ డివిజన్ పరిధిలో పోలింగ్ కేంద్రాలకు పోలింగ్ సామగ్రి, బ్యాలెట్ బాక్సులు భద్రపరిచే మార్కెట్ యార్డులోని స్ట్రాంగ్ రూమ్ ప్రాంతాన్ని ఎస్పీ ఆర్.గంగాధర్‌రావుతో కలిసి గురువారం పరిశీలించారు. కలెక్టర్ బాలాజీ మాట్లాడుతూ ఉయ్యూరు రెవెన్యూ డివిజన్ పరిధిలోని 25 పోలింగ్ కేంద్రాలకు బ్యాలెట్ బాక్సులు, పోలింగ్ సామగ్రిని తరలించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. పంపిణీ, పోలింగ్ అనంతరం బ్యాలెట్ బాక్సులు భద్రపరిచేందుకు వీలుగా ఆర్‌డీఓ కార్యాలయం ఉన్న మార్కెట్ యార్డులోని స్ట్రాంగ్ రూమ్ అందుబాటులోకి తెచ్చామన్నారు. పెనమలూరు, తాడిగడప మునిసిపాలిటీ పరిధిలో 11 పోలింగ్ కేంద్రాలు, కంకిపాడు, ఉయ్యూరు, తోట్లవల్లూరు మండలాల్లో 8 పోలింగ్ కేంద్రాలు, మొవ్వ, పామర్రు, పమిడిముక్కల మండలాల్లో ఆరు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ప్రతి డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రంలో నాలుగు ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేసి బ్యాలెట్ బాక్సులు, పోలింగ్ సామగ్రి పంపిణీ చేస్తామన్నారు. పోలింగ్ సామగ్రి తరలించేందుకు వీలుగా సెక్టార్ రూట్ వారీగా ప్రత్యేక వాహనాలు ఏర్పాటు చేశామన్నారు.


ఉయ్యూరు మార్కెట్‌యార్డులో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలిస్తున్న కలెక్టర్ బాలాజీ

పటిష్ట బందోబస్తు..

ఎస్పీ ఆర్.గంగాధర్‌రావు మాట్లాడుతూ పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. వాహనాలకు పార్కింగ్ సౌకర్యం కల్పించామన్నారు. ఎన్నికల విధుల్లో ఉన్న అధికారులు, సిబ్బందిని మాత్రమే డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాలకు అనుమతిస్తామన్నారు. సామగ్రి, బ్యాలెట్ బాక్సులు తరలించే వాహనాలకు ఎస్కార్ట్‌గా సీఐతో కూడిన బందోబస్తు ఉంటుందన్నారు. ఆర్‌డీఓ హెలా షారోన్, తహసీల్దార్ సురేష్ కుమార్, కమిషనర్ పాయసం వెంకటేశ్వరరావు, డీఎస్పీ సీహెచ్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

చల్లపల్లి: మనస్తాపానికి గురైన ఓ వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల పరిధిలోని ఆముదార్లంకలో చోటుచేసుకుంది. చల్లపల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఆముదార్లంకకు చెందిన తిరుమలశెట్టి రమణ(41) వ్యవసాయ కూలీగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. రమణకు భార్య శ్యామలమ్మ, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఇద్దరి మధ్య మనస్పర్థలు రావటంతో పెద్దమనుషుల సమక్షంలో మూడు సంవత్సరాల క్రితం విడిపోయారు. అప్పటి నుంచి శ్యామలమ్మ తన ఇద్దరు పిల్లలతో కలిసి పుట్టింటికి వెళ్లిపోగా రమణ తన సోదరుల వద్ద ఉంటున్నాడు. ఈ క్రమంలో మద్యానికి బానిసైన రమణ బుధవారం సాయంత్రం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. విషయం తెలుసుకున్న రమణ కుటుంబ సభ్యులు వెంటనే రమణను రేపల్లె ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకువెళ్లారు. పరిస్థితి విషమించటంతో అక్కడి నుంచి మెరుగైన వైద్య చికిత్స కోసం తెనాలి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న రమణ గురువారం ఉదయం మృతి చెందాడు. రమణ సోదరుడు ఏడుకొండల ఫిర్యాదు మేరకు చల్లపల్లి హెడ్‌కానిస్టేబుల్ బీవీఎస్‌వీ ఈశ్వరప్రసాద్ కేసు నమోదు చేశారు.


రమణ మృతదేహం

కాసులిస్తేనే ఇసుక

రూ.10వేలు కొట్టు.. లోడ్ పట్టు

- టీడీపీ నేతలకు డబ్బు చెల్లిస్తే చాలు.. దండిగా ఇసుక
- నందిగామ నియోజకవర్గంలో ఎంపీ అనుచరుల హల్‌చల్
- చలానా సైతం ఇవ్వకుండా దోపిడీ
- చందర్లపాడులోని కాసరబాద రీచ్ నుంచి మాత్రమే ఇసుక తరలింపు
- మిగిలిన అన్ని రీచ్‌లు మూత
- మిన్నకుండిపోతున్న రెవెన్యూ, పోలీస్, మైనింగ్ అధికారులు

కంచికచర్ల: నందిగామ నియోజకవర్గంలో టీడీపీ నేతల ఇసుకదందా యథేచ్ఛగా సాగుతోంది. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుంచి ఎంపీ అనుచరులు ప్రకృతి వనరులపై కన్నేశారు. 'నో చలానా.. ఓన్లీ క్యాష్' అంటూ ప్రభుత్వానికి చెల్లించాల్సిన చలానా లేకుండా దోచేస్తున్నారు. ఒక్కో లారీకి రూ. 10వేలు ఇస్తే చాలు ఎన్ని టన్నులయినా లారీలకు నింపుతామని ఎంపీ అనుచరులు బహిరంగంగా ప్రచారం చేస్తున్నట్లు తెలుస్తోంది. నియోజకవర్గంలో పెండ్యాల, చెవిటికల్లు, వేములపల్లి ఇసుక రీచ్‌లన్నీ మూతపడ్డాయి. అదేమంటే ఒక్క రీచ్ సరిపోతుందని ప్రభుత్వ పెద్దలు అంటున్నారని ఇసుక కొనుగోలు దారులు చెబుతున్నారు. కూటమి పార్టీకి చెందిన నాయకులకు ఎవ్వరికీ సంబంధం లేకుండా ఏకపక్షంగా ఎంపీ అనుచరులు ఒకే రీచ్ నుంచి ఇసుకను తోడేస్తున్నారు. నియోజకవర్గంలోని చందర్లపాడు మండలం కాసరబాద ఇసుక రీచ్ నుంచి రోజుకు 80 నుంచి 100 లారీల వరకు ఇసుకను విక్రయిస్తున్నారు. దీంతో ప్రభుత్వానికి చెల్లించాల్సిన రుసుం కూడా చెల్లించటం లేదనే విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. పోలీసులు, మైనింగ్, రెవెన్యూ అధికారుల సైతం ఈ దందాకు వత్తాసు పలుకుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. గ్రామ సచివాలయాల ద్వారా ఇసుక బుక్ చేసుకున్నా.. తట్టెడు ఇసుక దొరకదని రీచ్‌ల వద్ద ఎంపీ అనుచరులు బహిరంగంగా చెబుతున్నారు. గట్టిగా అడిగిన వారిపై పోలీసుల ద్వారా బెదిరింపులకు పాల్పడుతున్నారు. టీడీపీ నేతలకు డబ్బు ముట్టచెప్పితే చాలు దండిగా ఇసుక లోడ్ చేస్తున్నారు. ఇటీవల ఓ లారీ యజమానికి ఇసుకరీచ్‌లో పనిచేస్తున్న వ్యక్తుల మధ్య జరిగిన ఫోన్ సంభాషణ బయటకు రావటంతో ఈ విషయం బట్టబయలైంది. కంచికచర్ల మండలంలోని మూడు ఇసుక రీచ్‌లయిన పెండ్యాల – 1, పెండ్యాల–2, వేములపల్లి రీచ్‌లను మూసివేయించారు.


కాసరబాద ఇసుక రీచ్‌లో పొక్లెయిన్‌తో లారీకి లోడింగ్ చేస్తున్న దృశ్యం

రోజుకు రూ.10లక్షల ఆదాయం..

చందర్లపాడు మండలం కాసరబాద ఇసుక రీచ్ నుంచి ఎంపీకి రోజుకు రూ.10లక్షలు వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇతర వ్యక్తులకు వచ్చిన రీచ్‌లను మూసివేయించి కేవలం కాసరబాద రీచ్‌ను తెరిచి రూ. లక్షల్లో సొమ్ము చేసుకుంటున్నట్లు సమాచారం. రూ.10వేలు చెల్లించిన వారికి ఒక్కో లారీకి 30 టన్నుల నుంచి 40 టన్నుల ఇసుక లోడింగ్ చేస్తున్నారు. డబ్బు ఇచ్చిన వారికి భారీ పొక్లెయిన్లతో ఇసుకను ఎత్తి పోస్తున్నారు. ఇసుక అక్రమంగా తెలంగాణ రాష్ట్రం ఖమ్మం, వైరా, మధిర, హైదరాబాద్, విజయవాడకు తరలించి పెద్ద ఎత్తున దండుకుంటున్నారు. ప్రభుత్వ ఖజానాకు భారీ ఎత్తున గండి కొడుతున్నారు.

కూటమి పెద్దల లక్ష్యం అదేనా?

సార్వత్రిక ఎన్నికల్లో డబ్బులు బాగా ఖర్చు అయ్యాయని ఆ డబ్బులు సంపాదించాలంటే ఇసుక, మద్యం పాలసీల ద్వారా రాబట్టుకోవాలని ప్రభుత్వ పెద్దలు బహిరంగంగా అంటున్నట్లు పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. తమ నాయకుడు ఎన్నికల్లో పోటీ చేసినప్పుడు రూ.100కోట్లకు పైగా ఖర్చు అయ్యాయని ఆ డబ్బులు ఇసుక రూపంలో వసూలు చేసుకోవటం తప్పా అని ఎంపీ అనుచరులు అంటున్నారని ఆరోపిస్తున్నారు. ఏ నాయకుడికి సంబంధం లేదని తమ నాయకుడు రూ.200 కోట్లు సంపాదించే వరకు పార్టీ నాయకులెవ్వరికీ వాటాలు ఇచ్చేది లేదని ఎంపీ అనుచరులు ఖరాఖండిగా అంటున్నట్లు తెలుస్తోంది.

> **క్లియరెన్స్ రాగానే ప్రారంభిస్తాం..**
>
> నందిగామ నియోజకవర్గంలోని కంచికచర్ల మండలంలోని పెండ్యాల–1, పెండ్యాల–2, వేములపల్లి, చందర్లపాడు మండలంలోని ఏటూరు గ్రామాల్లోని ఇసుక రీచ్‌లకు ఆరు నెలల క్రితం అనుమతి ఇచ్చాం. కానీ ఆ రీచ్‌లను తిరిగి పునరుద్ధరించేందుకు ఎన్విరాన్‌మెంట్ క్లియరెన్స్ రావాల్సి ఉంది. అది రాగానే రెండు రోజుల్లో తిరిగి రీచ్‌లు ప్రారంభిస్తాం. రీచ్‌లలో అక్రమ వసూళ్లు చేస్తే చర్యలు తీసుకుంటాం.
>
> – వీరాస్వామి, మైనింగ్ ఏడీ విజయవాడ

బాలికపై లైంగిక దాడి.. నిందితులకు జీవిత ఖైదు

విజయవాడలీగల్: బాలికను బెదిరించి, లైంగిక దాడి చేసిన కేసులో నిందితులకు విజయవాడ పోక్సో కోర్టు న్యాయమూర్తి వి.భవాని జీవిత కాలం కఠినకారాగార శిక్ష, జరిమానా విధించారు. వివరాల్లోకి వెళ్తే.. పటమట పోలీస్ స్టేషన్ పరిధిలో నివసించే బాలిక, ఆమె తల్లిదండ్రులు చనిపోవడంతో తన తాత ఇంట్లో ఉంటూ దగ్గరలోని స్కూల్లో చదువుతోంది. ఈ క్రమంలో సాయి అనే యువకుడు పరిచయమయ్యాడు. అప్పుడప్పుడూ ఫోన్‌లో ఆమెతో మాట్లాడుతూ ఉండేవాడు. 2022 మే నెలలో రాత్రి సమయంలో సాయి బాలికకు ఫోన్ చేసి బయటకు పిలిచి, లైంగికదాడి చేశాడు. మరలా రెండు రోజుల తరువాత సాయి బయటకు రమ్మని అడుగగా, బాలిక రాను అని చెప్పడంతో మొదటి సారి కలిసిన సమయంలో తీసిన ఫొటోలను అందరికీ చూపిస్తాను అని భయపెట్టి బయటకు తీసుకొచ్చి మరో ఇద్దరు వ్యక్తులతో కలసి లైంగికదాడి చేసి.. ఎవరికైనా చెపితే చంపుతామని బెదిరించారు. తరువాత బాలిక పిన్ని గమనించి, కడుపు ఎత్తుగా ఉందని అడగగా, బాలిక జరిగిన విషయం చెప్పింది. మహిళా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దర్యాప్తులో భాగంగా అప్పటి దిశా పోలీస్‌స్టేషన్ ఏసీపీ బి.వి.నాయుడు పటమట దర్శిపేటకు చెందిన సిరిగిరి చంద్రశేఖర్ అలియాస్ సాయి, పటమట లంబాడీ పేటకు చెందిన అనురాజ్ ప్రకాష్ అలియాస్ శ్రీనుతో పాటు మరో జువైనల్ సహా ముగ్గురిని అదుపులోనికి తీసుకుని విచారించి, కోర్టులో హాజరుపరిచారు. నేరం రుజువు కావడంతో పోక్సో చట్టం ప్రకారం నిందితులైన సిరిగిరి చంద్ర శేఖర్ అలియాస్ సాయి, అనురాజ్ ప్రకాష్ అలియాస్ శ్రీనుకు మరణించేంత వరకు కఠినకారాగార శిక్ష, సాయికి రూ.32 వేలు, ప్రకాష్‌కు రూ.20 వేలు జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. అదే విధంగా బాధిత బాలికకు జరిమానా నుంచి రూ.30 వేలు, మరో రూ.ఐదు లక్షలను నష్టపరిహారం ఇవ్వాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థను ఆదేశించారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

■ శ్రీనివాస బిజినెస్ ఎడ్యుకేషన్ 100% పాస్ గ్యారంటీ ISO 9001 2015 Certified. APOSS ద్వారా 10th, Inter, నాగార్జున, ఆంధ్రా యూనివర్శిటీ ద్వారా BA, B.Com, B.Sc, M.Com, MBA, MCA ✆ 99493 08940

REAL ESTATE

PLOT FOR SALE

■ విజయవాడ, కంకిపాడు, హరివిల్లు ఎకాస్ వెంచర్స్ నందు 146 చ.గ.ల వెస్ట్ ఫేస్ రీ సేల్ ప్లాట్ అమ్మకానికి కలదు. సెల్: 94936 78904

■ బంపర్ ఆఫర్ కే రూ. 6 లక్షలకే 120 గ గేటెడ్ కమ్యూనిటీలో హౌసింగ్ ప్లాట్లు HMDA పరిధిలో కలవు రిజిస్ట్రేషన్ ఫ్రీ. ఫోన్: 63097 71255/ 77997 17179

SERVICES

BUSINESS OFFER

■ Work From Home / Earn Extra Income Opportunity, Part/Full Time, No Qualification or Experience Required. Ph: 63048 53218, 91218 68150

GOLD FINANCE

■ బంగారం కొనబడును. బ్యాంకులలో ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకి తీసుకుంటాం. ✆ 88024 89999

WANTED

■ రియల్ ఎస్టేట్స్ నందు పనిచేయుటకు టెలీకాలర్స్ M/F కావలెను. జీతం + కమీషన్ పద్ధతిపై. సంప్రదించండి : ✆ 97034 34023

■ ఎనికేపాడు, గూడవల్లి, సింగ్‌నగర్, కబేళా & బందరురోడ్డులో సెగార్డ్స్ వెంటనే కావలెను. ఒంటరి వారికి వసతి కలదు. మంచి జీతం. ✆ 96423 13999, 92472 71222

■ Wanted Sales Executives, Auto Drivers for 3 EV Auto Showroom at B6 Ind Estate, VJA. ✆ 93921 02274

■ ఎనికేపాడులో గల ప్రముఖ షోరూం నందు స్టాండింగ్ డ్యూటీ 8 గం చేయుటకు అనుభవం కలిగిన సెక్యూరిటీ గార్డ్స్ కావలెను వయస్సు 40 సం లోపు. డ్రెస్ పాస్. ✆ 95333 48491

■ విజయవాడలో ఓమ్ని అంబులెన్స్‌లు నడుపుటకు డ్రైవర్లు కావలెను. సంప్రదించండి. ✆ 9704 336 887

■ క్రాంతి రోడ్ ట్రాన్స్‌పోర్ట్ VJA ఆటోనగర్ ఆఫీస్ నందు గుమాస్తాలుగా పని చేయుటకు 10th ఆపై చదివి 30 సం॥ లోపు వయస్సు గల మేల్ అభ్యర్థులు కావలెను. బ్యాచిలర్స్‌కు వసతి సౌకర్యం కలదు. సంప్ర: Ph No: 888 632 4444

■ విజయవాడలోని ప్రముఖ రియల్ సంస్థ వారికి మార్కెటింగ్ సిబ్బంది కావలెను. డిజిటల్ మార్కెటింగ్‌లో అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత. మంచి కమీషన్ ఇవ్వబడును. ✆ 91107 53627

■ Wanted Male Marketing Staff, Course incharges and Female Telecallers Qualification Any Degree Age Limit: 25 to 45 years, Salary: 10,000/- to 25,000/- working Location: Master Minds College, Vijayawada, Contact: 89781 80832

■ ఆల్వాటెక్ సిస్టమ్స్‌లో పనిచేయుటకు లేత్‌మిషన్ టర్నర్స్, ఫిట్టర్స్, వెల్డర్స్, టెక్నికల్ సూపర్‌వైజర్స్, డ్రాఫ్ట్‌మెన్స్, మెకానికల్ ఇంజనీర్స్ కావలెను. సంప్ర. ✆ 96421 17517

■ విజన్ ఆటోమొబైల్స్ ఆపె ఆటో షోరూము కృష్ణా జిల్లాలోని విజయవాడ, గుడివాడ నందు సేల్స్ మేనేజరు - 4, సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ - 18, స్పేరు పార్ట్స్ మేనేజరు - 2, సర్వీసు సూపర్‌వైజర్లు - 4, మెకానిక్స్ - 6, రిసెప్షనిస్టు - 4, అకౌంటెంట్-2, హెల్పర్-6, కంప్యూటర్ ఆపరేటర్స్- 5, కావలెను. సంప్ర॥ సెల్ :77999 09045 / 77999 09054. Email: visionauto.jobs@gmail.com. గమనిక : ది. 23/02/2025, ఉ॥ 10.00 గం॥లకు ఇంటర్వ్యూలు జరుగును. వేదిక : విజన్ ఆటో మోటివ్, ప్లాట్ నెం. 42 & 43, 100 అడుగుల రోడ్, PSC బోస్ రోడ్, ఆటోనగర్, VRL ఆఫీస్ ఎదురు, విజయవాడ.

■ కష్టమైనా కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకో వడానికి స్త్రీలు/పురుషులు, ఆయా, నర్సులు, వంట వారు, RMP & డ్రైవర్స్ కావలెను. జీ: 15 వేలు – 40 వేలు, ఫ్రీ రూం+భోజనం. HYD. 7995365999

గమనిక

సాక్షి దినపత్రికలో ప్రకటనలకై మీ ప్రాంతంలోని మా ప్రతినిధులను సంప్రదించండి

మచిలీపట్నం, పెడన 9912220643 | అవనిగడ్డ 7995666903 | గుడివాడ 7995092115 | పామర్రు 9010577706 | కైకలూరు 9951602965 | నందిగామ 7995092114 | జగ్గయ్యపేట 9912220547 | మైలవరం, ఇబ్రహీంపట్నం 9010223734 | తిరువూరు 9951020399 | నూజివీడు 9912220544

ఎన్టీఆర్ జిల్లా + కృష్ణాజిల్లా నాలుగు లైన్లు రూ. 600/- ప్రతి అదనపు లైను రూ. 150/- + 5% GST